క్లుప్తంగా

పిల్లలపై శ్రద్ధచూపాలి



విద్యార్థులకు సూచనలిస్తున్న అధికారులు

వేములవాడరూరల్: పదోతరగతి, ఇంటర్ విద్యార్థులకు తప్పనిసరిగా కంప్యూటర్ నాలెడ్జ్ ఉండాలని డీఈవో ఎ.రమేశ్‌కుమార్ తెలిపారు. రూరల్ మండలం మర్రిపల్లి కేజీబీవీని డీఈవో రమేశ్, కోఆర్డినేటర్ శైలజ శనివారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి పాఠ్యాంశంలో విషయ పరిజ్ఞానంపై అడిగి తెలుసుకున్నారు. కిచెన్ పరిసరాలు, కూరగాయలు పరిశీలించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ప్రిన్సిపాల్ శకుంతల, సిబ్బంది ఉన్నారు.

భద్రాద్రి రాముడికి పూజలు



ఆది శ్రీనివాస్‌ను ఆశీర్వదిస్తున్న అర్చకుడు

వేములవాడ: జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ శనివారం భద్రాద్రి రాముడిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. అనంతరం వేదోక్త ఆశీర్వచనం గావించారు.

లవ్ జిహాద్ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సభ్యులు

సిరిసిల్లటౌన్: లవ్ జిహాద్ పేరుతో హిందూ అమ్మాయిలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు శనివారం జిల్లా కేంద్రం సిరిసిల్ల అంబేడ్కర్ చౌరస్తాలో లవ్ జిహాద్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసనలు హోరెత్తించారు. నాయకులు బుర్ర లింగమూర్తి, బండారి సంతోష్, కొమిరె గౌతం నాయిని హరికృష్ణ, ధీరజ్, పురుషోత్తం, అనీల్, అఖిల్, కైలాష్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ అందించాలి..



సభ్యత్వ నమోదు చేపడుతున్న కదారి రాములు

వేములవాడఅర్బన్: భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ అందించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కదారి రాములు అన్నారు. వేములవాడ పట్టణంలోని సుతారి కార్మిక సంఘం ఆధ్వర్యంలో సభ్యత్వనమోదు కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు 55 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రమేశ్, దేవయ్య, వెంకటేశం, గంగయ్య తదితరులు ఉన్నారు.

మిడ్‌మానేరులో చేపలు పట్టొద్దు

ఇది చేపల సంతతి సమయం

ఆగస్టు 31 వరకు చేపల వేట నిషేధం

బోయినపల్లి(చొప్పదండి): మధ్యమానేరు ప్రాజెక్టులో ఈనెల 1వ తేదీ నుంచి ఆగస్టు 31 వరకు చేపల వేట నిషేధించినట్లు మత్స్యశాఖ అధికారి శివప్రసాద్ తెలిపారు. ఈ సమయంలో చేపల సంతతి వృద్ధి జరుగుతుందని.. దీని ద్వారా మత్స్యకారులు ఎక్కువ సంఖ్యలో చేపలు పట్టుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈక్రమంలో మత్స్యకార్మికుల సంఘాల వారు తమ పరిధిలోని సంఘ సభ్యులు చేపలు పట్టరాదని తెలియపరచాలని కోరారు. గ్రామాల్లో చేపలు పట్టరాదని దండోరా వేయించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వులు ఉల్లంఘించి చేపలు పడితే వలలు, తెప్పెలు వేట పరికరాలు జప్తుచేస్తామని హెచ్చరించారు.

పోస్టు మాస్టర్‌కు సన్మానం



రుద్రంగి: అంతర్జాతీయ తపాలా కార్మిక దినోత్సవం సందర్భంగా శనివారం రుద్రంగి తపాలా మాస్టర్ మోహన్, తపాలా సిబ్బందిని రుద్రంగి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మంచె రమేశ్, జిల్లా పీఆర్వో తీపిరెడ్డి వెంకట్‌రెడ్డి, కార్యదర్శి బండి యాదగిరి, కోశాధికారి కొమిరె శంకర్, సభ్యులు పాల్గొన్నారు.

- ఆడిపాడిన బ్రాహ్మణ మహిళలు
- వేములవాడలో కలుసుకున్న అతివలు
- వేదికగా నిలిచిన భీమన్నగుడి

ఆషాఢం..

ఆడపడచుల సమ్మేళనం

వేములవాడ: పట్టణానికి చెందిన ఆడపడచులంతా చిన్నప్పటి నుంచి ఇక్కడే చదివి ఆడి–పాడి పెళ్లిళ్లు చేసుకుని ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా ఆషాఢమాసం వారిని తిరిగి మళ్లీ ఒకేచోటికి చేర్చింది. ప్రతి ఏటా ఆషాఢమాసంలో తొలిఏకాదశి పర్వదినం సందర్భంగా పుట్టినిళ్లైన వేములవాడకు చేరుకుని వనభోజనాలు చేసి, వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అయితే కరోనాతో మూడేళ్లుగా వీరంతా ఈ వేడుకలకు దూరమయ్యారు. కరోనా నుంచి కోలుకున్న తర్వాత ఈసారి ఆషాఢ మాసం కలిసొచ్చింది. రాజన్న ఆలయ అనుబంధ ఆలయంలో అంతా కలిశారు. ఆడిపాడారు. చిన్ననాటి ముచ్చట్లు చెప్పుకుని మురిశారు. అంతా కలసి సామూహిక వన భోజనాలు చేశారు.





తొలి ఏకాదశి అంటే సంబురం



చాలా ఏళ్ల తర్వాత తొలి ఏకాదశి రోజున వేములవాడలో మరోసారి కలిశాం. చిన్నప్పటి నుంచి మేమంతా ఇదే గుడిలో తొలి ఏకాదశి రోజున సంబరాలు జరుపుకునే వాళ్లం. మళ్లీ ఇప్పుడు అవకాశం రావడం ఆనందంగా ఉంది. ఇలాంటి అవకాశం లభించడం మా అదృష్టంగా భావిస్తున్నాం. పొద్దంతా ఆడిపాడాం. మేమంతా మళ్లీ కలుస్తామనేదే మాకు పెద్ద పండుగ.

– ప్రతాప స్వప్న, హైదరాబాద్

జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నాం



మేము ప్రస్తుతం జగిత్యాలలో ఉంటున్నాం. ఆషాఢమాసంలో మేమంతా ఇలా వేములవాడ మా పుట్టినింటిలో కలుసుకోవడం ఆనందంగా ఉంది. గత స్మృతులను గుర్తుచేసుకున్నాం. చిన్నప్పటి ముచ్చట్లు చెప్పుకుని మురిసిపోయాం. ఇక్కడి సాంప్రదాయాల గురించి మా పిల్లలకు తెలియజేశాం. అంతా కలిసి ఆటా – పాటలతో సంతోషంగా గడిపాం. నిజంగా వేములవాడలో పుట్టినందుకు గర్వంగా ఉంది.

– నమిలకొండ, సాకేత, జగిత్యాల

అంతరించి పోతున్న ఆటలకు జీవం



అంతరించిపోతున్న ఆటలను తిరిగి ఈ తరాలకు పరిచయం చేశాం. కరోనాతో కలవలేక పోయాం. ఈసారి అందరూ కలిసే అవకాశం రావడం ఆనందంగా ఉంది. గత జ్ఞాపకాలను పంచుకున్నాం. ఎక్కడెక్కడో స్థిరపడిన వాళ్లంతా తిరిగి మా పుట్టినింటిలో కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. తొలి ఏకాదశి వేడుక తమకు ఎప్పుడొస్తుందా అని ఎదురు చూస్తుంటాం.

– ప్రతాప శైలజ, హైదరాబాద్

సనాతన సంస్కృతిని కొనసాగిస్తున్నాం



నేను వేములవాడ పుట్టిపెరిగాను. మంథని మా అత్తగారు. హైదరాబాద్‌లో నివసిస్తున్నాం. వేములవాడలో కొనసాగుతున్న సనాతన సంస్కృతిని పునరుద్ధరించేందుకు మా చిన్నప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకునేందుకు హైదరాబాద్ నుంచి వచ్చాను. స్నేహితురాళ్లతో ఆనందంగా గడిపాను. మేమంతా వెనక్కి వెళ్లి చిన్నప్పటి ముచ్చట్లు చెప్పుకుని సంబురపడ్డాం. ఈ కార్యక్రమం ముందు తరాలకు ఇలాగే కొనసాగాలనేది మా ఆకాంక్ష.

– గన్మోటి అపర్ణ, హైదరాబాద్

క్రీడలతో మానసికోల్లాసం



బహుమతులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

వేములవాడరూరల్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మర్రిపల్లిలో క్రికెట్ పోటీల ముగింపు సందర్భంగా పాల్గొని మాట్లాడారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమన్నారు. వేములవాడ రూరల్ ఎంపీపీ బండ మల్లేశం మాట్లాడుతూ.. గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. మొదటి బహుమతి గెలుపొందిన ఎదురుగట్ల టీంకు రూ. 20వేలు, మర్రిపల్లి టీంకు రెండో బహుమతి రూ. 15వేలు అందించారు. కార్యక్రమానికి ఉపసర్పంచ్ బాలకిషన్, ఉల్లెందుల లచ్చయ్య, బత్తిని ఎల్లగౌడ్, మారం రాజేశం, మహేశ్, గాలి ప్రవీణ్, మల్లేశం, గోపు సంజీవ్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యులకు సన్మానం



వైద్యులను సన్మానిస్తున్న విద్యార్థులు

వేములవాడ/వేములవాడఅర్బన్/గంభీరావుపేట/ఎల్లారెడ్డిపేట: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని వేములవాడ ఏరియా ఆసుపత్రిలో వైద్యుల దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మారం కుమార్ ఆధ్వర్యంలో వైద్యులు ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ రేగులపాటి మహేశ్‌రావు, డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ చైతన్య సుధా, డాక్టర్ దీప్తిలను ఘనంగా సన్మానించారు. గంభీరావుపేట మండలకేంద్రంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, కార్యదర్శి ఎర్ర శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైద్యులను సన్మానించారు. ఎల్లారెడ్డిపేటలోని ప్రభుత్వ,ప్రైవేట్ డాక్టర్లను లయన్స్ క్లబ్, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. వేములవాడ పట్టణంలోని విద్యార్థులు పట్టణానికి చెందిన వైద్య దంపతులు నాగమల్ల శ్రీనివాస్– పద్మలతలను ఘనంగా సన్మానించారు.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు



మాట్లాడుతున్న కేకే.మహేందర్ రెడ్డి

తంగళ్లపల్లి: సిరిసిల్ల నియోజవర్గ ప్రజలు దొరపెడీ రాజ్యం పోవాలని మార్పు కోరుకుంటున్నారని.. కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే.మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఓబులాపూర్, వేణుగోపాలపూర్ గ్రామాల్లో కాంగ్రెస్ జెండా పండుగ నిర్వహించారు. అనంతరం పలువురు రైతులు కేకే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే.టోని, నాయకులు లింగాల భూపతి, అల్వాల లక్ష్మణ్, గట్టు లింగారెడ్డి, గుగ్గిళ్ల శ్రీకాంత్, పర్శురాములు, మునిగెల రాజు, కల్లెం శ్రీనివాస్‌రెడ్డి, బాలసాని శ్రీనివాస్, అరెపల్లి బాలు, శ్యామ్, శ్రీనివాస్, తిరుపతి, రాజు, మహిళా నాయకులు హారిక రెడ్డి, సరిత, సంగీత, మైనార్టీ నాయకులు ఇక్బాల్, మహమూద్, అలీ తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తులో జీవితాలు నాశనం చేసుకోవద్దు



మాట్లాడుతున్న ఎస్సై పి.లక్ష్మారెడ్డి

తంగళ్లపల్లి: యువత మత్తుపదార్థాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని తంగళ్లపల్లి ఎస్సై పాకాల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని బస్వాపూర్‌లో గ్రామస్తులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మత్తుపదార్థాలు, సైబర్ క్రైమ్‌లపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. గంజాయి వంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎవరైనా సేవించినా, విక్రయించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామంలో కమ్యూనిటీ సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలని దీంతో నేరాలను అరికట్టవచ్చన్నారు. యువత గొడవలకు దూరంగా ఉండాలని కేసుల పాలైతే జీవితాలు పాడవుతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గొడిసెల నీరజ, ఎంపీటీసీ పూర్మాని కనకలక్ష్మి, హెడ్ కానిస్టేబుల్ మల్లేశం, గ్రామస్తులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో బీజేపీ బలోపేతం



మాట్లాడుతున్న కార్తీక్‌రెడ్డి

ముస్తాబాద్: క్షేత్రస్థాయిలో గ్రామగ్రామాన బీజేపీని బలోపేతం చేస్తున్నామని పార్టీ మండల అధ్యక్షుడు కస్తూరి కార్తీక్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిప్పలపల్లిలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రధాని మోదీ హయాంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీదే విజయం అన్నారు. కార్యకర్తలు కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటికి వివరించాలన్నారు. నాయకులు రామసుబ్రమణ్యం, ఎల్లన్న, మీస సంజీవ్, మల్లారెడ్డి, సుధాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సాయిచంద్‌కు కొవ్వొత్తులతో నివాళి



నివాళులర్పిస్తున్న తోట ఆగయ్య, తదితరులు

సిరిసిల్లఅర్బన్/తంగళ్లపల్లి/గంభీరావుపేట: రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్, ప్రజాగాయకుడు సాయిచంద్ మృతిపట్ల బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య శనివారం నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి మౌనం పాటించారు. తంగళ్లపల్లి మండలంలోని సారంపల్లిలో సర్పంచ్ కొయ్యడ రమేశ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి.. సాయిచంద్ ఆత్మకు శాంతిచేకూరాలని ప్రార్థనలు చేశారు. గంభీరావుపేట మండలంలోని సముద్రలింగాపూర్‌లో సాంస్కృతిక కళాకారులు సాయిచంద్ మృతికి నివాళులు అర్పించారు.

గిరిజనుల పక్షపాతి సీఎం కేసీఆర్

ఎల్లారెడ్డిపేట: పోడు భూములకు పట్టాలు ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని, సీఎం గిరిజనుల పక్షపాతిగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని జిల్లా విజిలెన్స్ కమిటీసభ్యుడు అజ్మీరా తిరుపతినాయక్, బీఆర్ఎస్ ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు భూక్య సీత్యానాయక్ కొనియాడారు. పోడు భూములకు పట్టాలు పంపిణీపై హర్షం వ్యక్తం చేస్తూ ఎల్లారెడ్డిపేటలో శనివారం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, గిరిజన సంక్షేమ సంఘాల ప్రతినిధులు శంకర్‌నాయక్, పెంటయ్య నాయక్, పుణ్యానాయక్, శ్రీరాంనాయక్, కైలాస్‌నాయక్, సురేష్‌నాయక్, రవినాయక్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం

ఎల్లారెడ్డిపేట: ఆపద సమయంలో నిరుపేదలకు సీఎం సహాయనిధి వరంలా మారిందని మండల సర్పంచ్‌ల ఫోరం కన్వీనర్ కొండాపురం బాల్‌రెడ్డి అన్నారు. రాచర్లబొప్పాపూర్‌లో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం పంపిణీ చేశారు. బాల్‌రెడ్డి మాట్లాడుతూ ఈ పథకాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇల్లందుల శ్రీనివాస్‌రెడ్డి, వంగ శివరాంరెడ్డి, మంద రాజిరెడ్డి, నిమ్మల కిషన్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

ముస్తాబాద్: మండలంలోని తుర్కపల్లిలో సీసీ రోడ్డు పనులను శనివారం ప్రారంభించినట్లు సర్పంచ్ పద్మ తెలిపారు. రూ.10లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులను త్వరగా పూర్తిచేయాలని కోరారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టిన పనులను ప్రాధాన్యతా క్రమంలో చేపడుతున్నామన్నారు. బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు దేవదాస్, గూడూరి భరత్, బాలయ్య, దుర్గప్రసాద్, నర్సయ్య, సాయిప్రసాద్, రంజిత్, శేఖర్, నర్సింలు, సుమన్ పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు

కోనరావుపేట: నిమ్మపల్లిలో ముదిరాజ్ కులస్తుల సంఘం భవనం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని జెడ్పీచైర్‌పర్సన్ అరుణను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా స్పందించిన జెడ్పీటీసీ రూ.2 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు సీనియర్ నాయకులు రాఘవరెడ్డి తెలిపారు. నిమ్మపల్లిలోని సంఘం బాధ్యులకు ప్రొసీడింగ్‌ను శనివారం అందించారు. సింగిల్‌విండో చైర్మన్ బండ నర్సయ్య, సర్పంచ్ కదిరె శ్రీనివాస్, ఉపసర్పంచ్ దొంత రవేణి శ్రీనివాస్, రైతుబంధు అధ్యక్షుడు ప్రతాప రెడ్డి, ముదిరాజ్ సంఘ నాయకులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు పరామర్శ

వేములవాడరూరల్: మండలంలోని నూకలమర్రి సర్పంచ్ పెండ్యాల తిరుపతి భార్య మృతిచెందడంతో ఆయనను అర్బన్ మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలువురు ప్రజాప్రతినిధులు శనివారం పరామర్శించారు. రెండు రోజుల క్రితం అనారోగ్యంతో ఆమె మృతిచెందడంతో ఆయనను కలిసి ప్రగాఢ సంతాపం తెలిపారు.

క్రీడాపాఠశాలలో ఎంపిక పోటీలు

ఇల్లంతకుంట: రాష్ట్రస్థాయి క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు 4,5 తరగతులు చదివే విద్యార్థుల కు ఈనెల 3న ఇల్లంతకుంట జెడ్పీ పాఠశాలలో ఎంపికపోటీలు నిర్వహిస్తున్నట్లు పీఈటీ సాబిర్ తెలిపారు. 4వ తరగతి విద్యార్థులు సెప్టెంబర్ 1, 2014 , ఆగస్టు 31, 2015 మధ్య జన్మించి ఉండాలని, ఐదో తరగతి చదివే విద్యార్థులు సెప్టెంబర్ 1, 2013 నుంచి ఆగస్టు 31, 2015 మ ధ్య జన్మించి ఉండాలన్నారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్ తీసుకురావాలన్నారు.

యువతి కిడ్నాప్ కలకలం



ఎన్గల్‌లో పోలీసుల మోహరింపు

చందుర్తి(వేములవాడ): కరీంనగర్ జిల్లా రామడుగు మండలం మోతెకు చెందిన యువతిని చందుర్తి మండలం ఎన్గల్ గ్రామానికి చెందిన యువకులు కిడ్నాప్ చేసిన సంఘటన శనివారం రాత్రి కలకలం సృష్టించింది. యువతి కిడ్నాప్ విషయం తెలుసుకున్న ఆమె కుటుంబసభ్యులు, బంధువులు వాహనాల్లో వెంబడించారు. పోలీసులు సైతం గ్రామానికి చేరుకొని పలువురి ఇళ్లలో సోదాలు చేశారు. పూర్తి వివరాల్లోకి వెళితే.. మోతెకు చెందిన యువతి శనివారం గ్రూప్–4 పరీక్ష రాసి ఇంటికి చేరుకునే క్రమంలో ఎన్గల్‌కు చెందిన ఐదుగురు యువకులు కిడ్నాప్ చేసినట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న యువతి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతోపాటు యువకుల వాహనాన్ని వెంబడించారు. ఈక్రమంలో వేములవాడ పట్టణ శివారులో యువకులు తప్పించుకున్నారు. చందుర్తి ఎస్సై రమేశ్‌తోపాటు మరో ముగ్గురు ఎస్సైలు, 20 మంది పోలీస్ సిబ్బందితో ఎన్గల్ గ్రామానికి చేరుకుని పలు ఇళ్లలో సోదాలు చేశారు. యువతి బంధువులు 30 మందికి పైగా గ్రామంలో ఆరా తీయడంతో ఏం జరుగుతుందో తెలియక గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. కిడ్నాప్‌తో సంబంధం ఉన్న యువకుల సెల్‌ఫోన్లు స్విచ్చాఫ్ వస్తున్నాయని.. వారి ఆచూకీ కోసం గ్రామ పరిసర ప్రాంతాల్లో పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నట్లు తెలిసింది.



గోరింటాకు వేడుక

ముస్తాబాద్: ఆషాడం మాసం సందర్భంగా గోరింటాకు వేడుకలను మండలంలోని బందనకల్ జెడ్పీ పాఠశాలలో శనివారం ఉత్సాహంగా జరుపుకున్నారు. ఆషాడం మాసంలో గోరింటాకు ధరించడం వల్ల సకల శుభాలు కలిగి ఆరోగ్యంగా వుంటారని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. హెచ్ఎం రవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్షాలు కురువాలి.. వానదేవుడా..



కప్పతల్లి ఆటలు ఆడుతున్న రైతులు

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని రైతులు శనివారం ఇంటింటికి తిరుగుతూ కప్పతల్లి ఆటలు ఆడారు. వర్షాలు కురువాలి వానదేవుడా.. పంటలు పండాలి వానదేవుడా.. అంటూ వానదేవున్ని వేడుకున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలన్నర గడుస్తున్నా వర్షాలు కురువకపోవడంతో రైతులు ఉదయం లేచి ఆకాశం వైపు చూస్తున్నారు. విత్తనాలు పెట్టి నెలదాటుతున్న వర్షాల జాడేలేదని కప్పతల్లి ఆటలతో గ్రామదేవతలకు జలాభిషేకం చేశారు. రైతులు ఎగుమంటి రూపేందర్, గడ్డంకృష్ణ, ఎల్లయ్య,మానుక పోచయ్య, ఉమేశ్ మైలారం శ్రీనివాస్,జగన్నాథం శ్రీనివాస్, మానుక శ్రీనివాస్, బాలరాజు ఉన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం



పనులు ప్రారంభిస్తున్న సెస్ డైరెక్టర్

గంభీరావుపేట: గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తున్నామని సెస్ గంభీరావుపేట మండల డైరెక్టర్ గోరినేని నారాయణరావు అన్నారు. మండలంలోని లింగన్నపేటలో శనివారం విద్యుత్ లైన్ల ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులు ప్రారంభించారు. గ్రామాల్లో లూజ్ వైర్లను సరిచేస్తూ అవసరమైన చోట విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దుబాసి రాజు, నాయకులు లింగన్నగారి దయాకర్‌రావు, అంజయ్య, పాపారావు,

డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలి



ఇళ్లులేని వారితో మాట్లాడుతున్న నాయకులు

బోయినపల్లి: ఇళ్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీఐటీయూ, ప్రజా సంఘాల నాయకులు గురజాల శ్రీధర్, రామంచ అశోక్ తదితరులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం బోయినపల్లిలో ఇళ్లులేని పేదల కుటుంబాలను కలిసి మాట్లాడారు. మండలంలో డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చి ఏళ్లు గడిచిందన్నారు. సీఎం కేసీఆర్ ఇళ్ల నిర్మాణానికి ఓసారి రూ. 5లక్షలు, మరోసారి రూ.3లక్షలు ఇస్తామని చెప్పి దాటేస్తున్నారని ఆరోపించారు. యుద్ధ ప్రాతిపదికన మండలంలో డబుల్‌బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. 3న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్నట్లు తెలిపారు.



ఎల్లారెడ్డిపేటలో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

బోయినపల్లి: ప్రభుత్వ హాస్టళ్లు, ఇతర ప్రభుత్వ రంగసంస్థల్లో రజక సామాజిక వర్గం వారు బట్టలు ఉతకాలని ప్రత్యేక జీవో తెచ్చినందుకు హర్షం వ్యక్తంచేస్తూ రత్నంపేట గ్రామంలో రజకసంఘం నాయకులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు రజకసంఘం మండల అధ్యక్షుడు ర్యాగల్ల అంజయ్య, నాయకులు మైలారం దేవయ్య, ర్యాగల్ల మల్లేశం, తిరుపతి, బాలయ్య పాల్గొన్నారు.

ఇంటింటికి బీజేపీ సంక్షేమ పథకాలు

గంభీరావుపేట: మండలంలోని భీముని మల్లారెడ్డిపేటలో బీజేపీ నాయకులు శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తొమ్మిదేళ్ల పాలనలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు వివరించారు. బీఆర్ఎస్ అక్రమాలను , మోసపూరిత మాటలను ఎండగట్టాలన్నారు. నాయకులు శేఖర్, మల్లారెడ్డి, దేవసాని కృష్ణ, పత్తి స్వామిరాజ్, గాండ్ల రాజం, సత్యం, ఆంజనేయులు, రాంరెడ్డి, సందీప్‌రెడ్డి, దేవరాజు, శంకర్, రవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.